ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి
# జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | సోమవారం | 14.09.2026 | సంపుటి : 2 | సంచిక : 73 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్


# దేశ భద్రత విషయంలో రాజీ పడేది లేదు

## 2029 నాటికి ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి

### కేంద్రహోంమంత్రి అమిత్‌షా కీలక వ్యాఖ్యలు

ఉమ్మడి పౌరస్మృతి అంశంపై కేంద్రహోంమంత్రి అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. 2029 నాటికి భాజపా నేతృత్వంలోని ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో యూసీసీని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముంబయిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి వ్యక్తిగత విషయాల్లో ఒకే రకమైన చట్టాన్ని వర్తింపజేసేందుకు ఉద్దేశించిన ఉమ్మడి పౌరస్మృతిని ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అమల్లోకి తీసుకొచ్చామని అమిత్‌షా చెప్పారు.



ముంబయి, సెప్టెంబర్ 13 : 2029 నాటికి 21 ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో అమల్లోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు.దేశ భద్రత విషయంలో రాజీ పడేది లేదని ఈ సందర్భంగా అమిత్‌షా పేర్కొన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదం పట్ల ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశామన్నారు. 2014కు ముందు అవినీతి, వారసత్వ రాజకీయ యుగం రాజ్యమేలాయన్నారు. భాజపా దాన్ని పూర్తిగా -మిగతా 2 లో..



# ఎప్పుడూ పదవుల కోసం ఆరాటపడలేదు

## కాంగ్రెస్‌ను వీడేది లేదు

## మచ్చ లేకుండా పనిచేశా

### ప్రస్తుతం అవకాశవాద రాజకీయాలు ఎక్కువయ్యాయి

### మాజీ మంత్రి కొండా సురేఖ

వరంగల్, సెప్టెంబర్ 13 : కార్యకర్తలు పది రోజుల నుంచి ఎంతో బాధపడుతున్నారని మాజీ మంత్రి కొండా సురేఖ చెప్పారు. సుమంత్ బెయి ల్ కోసం కార్యకర్తలను కలవడం ఆలస్యమైందని తెలిపారు. ఇప్పుడున్న నాయకులు పొద్దున ఒక పార్టీలో మధ్యాహ్నం ఒక పార్టీలో తిరుగుతు న్నారని అన్నారు. తాను ఎప్పుడూ పదవుల కోసం ఆరాటపడలేదని తెలిపారు. తమ గురించి అనేక ఊహాజనిత వార్తలు వస్తున్నాయని.. తాము కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి -మిగతా 2 లో..




## రూల్స్ ఫాలో అవ్వడం కాదు..

# సెట్ చెయ్యాలి

## భిన్నత్వమే బ్రిక్స్ దేశాల బలం

### సవాళ్లను సకాలంలో గుర్తించి, చర్యలు తీసుకోవడం ముఖ్యం

### బ్రిక్స్ నేతలతో ప్రధానిమోదీ

గ్లోబల్ సౌత్ దేశాలు ప్రపంచ సంక్షోభాల విషయంలో ముందు వరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే విషయంలో మాత్రం వెనుక వరుసలో ఉండిపోతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇకపై గ్లోబల్ సౌత్ నిబంధనలు పాటించేవిగానే ఉండకూడదని.. నియమాలు రూపొందించేవిగా ఎదగాలని ఆకాక్షించారు. భిన్నత్వమే బ్రిక్స్ దేశాల బలమని అన్నారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 : ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న బ్రిక్స్ వార్షిక సదస్సులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రపంచవ్యాప్తంగా నిరంతరం ఘర్షణలు పెరుగుతున్నాయి. ఆ ప్రభావం సామాన్యుల జీవితాలపై ప్రభావం పడుతోంది. సవాళ్లను సకాలంలో గుర్తించి, చర్యలు తీసుకోవడం ముఖ్యం. అంటువ్యాధుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థపై బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. పరస్పర సహకారంతో ప్రపంచ దేశాలు మరింత అభివృద్ధి సాధించాలి. అయితే.. మన దేశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సమయంలో పర్యావరణానికి ఇబ్బంది కలిగించొద్దు. -మిగతా 2 లో..



పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు జనంవార్త దినపత్రిక తరపున

## వినాయక చవితి శుభాకాంక్షలు

వినాయక చవితి సందర్భంగా సోమవారం కార్యాలయానికి సెలవు.. మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

- ఎడిటర్

## ఆర్యవైశ్యులందరూ

# ఐక్యంగా ఉండాలి

## అప్పుడే రాజకీయంగా అవకాశాలు

## ఆర్యవైశ్యులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

### ఉప్పల్ భగాయత్‌లో ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన

రాజకీయాల్లో మీ వాటా మీరు తీసుకోవాలంటే.. తగిన అవకాశాలు, ప్రాధాన్యం పొందాలంటే ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆదివారం ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో ప్రసంగించారు. ఆర్యవైశ్య సమాజం ఆర్భాటాలు, ప్రచారాలకు దూరంగా ఉండటంతో రావాల్సినంత గుర్తింపు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వంలో ఒక కార్పొరేషన్ పదవి ఇచ్చామని.. కొడంగల్‌లోని మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇచ్చామని గుర్తు చేశారు. "సమాజ సంక్షేమానికి మీరు అందిస్తున్న తోడ్పాటును గుర్తించి ప్రభుత్వం మీ వెన్నంటి ఉంటుంది. ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారంతో పాటు అవసరమైన అన్ని రకాల ఆర్థిక సహాయాన్ని అందిస్తాం. నేను మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తా.



హైదరాబాద్, సెప్టెంబర్ 13 : ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారు. చాలామంది పేదలు ఉన్నా పేదరికాన్ని కడుపులోనే దాచుకుని గౌరవంతో జీవించే స్వభావం మీది. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి పూచీకత్తు లేకపోయినా పేదలకు ఆర్థిక సహాయం చేసే కమ్యూనిటీ" అని సీఎం కొనియాడారు. "ప్రపంచంలో వ్యవసాయం, వ్యాపారం అనే రెండు ప్రధాన వృత్తులు ఉన్నాయి. వ్యాపారంలో రాణించి ఆటుపోట్లను ఎదుర్కొన్న అనుభవం ఆర్యవైశ్యుల సొంతం. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణం, వివాహాలు, వాహనాల కొనుగోలు వంటి నిర్ణయాల్లో మీ సలహాలు తీసుకుంటారు. ముందుచూపు అనేది మీ రక్తం, డీఎన్‌లోనే ఉంది. ఈ ఆత్మ గౌరవ భవనం పేద ఆర్యవైశ్య కుటుంబాలకు సంపూర్ణంగా ఉపయోగపడాలి. ప్రపంచవ్యాప్తంగా -మిగతా 2 లో..



## నేడు వినాయక చవితి

నేటి నుంచి నవరాత్రులు గణపతి పూజలు అందుకోనున్నారు. నవరాత్రులు గణపతికి ఘనంగా పూజలు నిర్వహించి, నిమజ్జనం నిర్వ హించేందుకు భక్త కోటి సిద్ధమౌతున్నారు. ఖైరతాబాద్ మహా గణపతి పూర్తి రూపంతో భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. సోమవారం నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. పూర్తిగా మట్టితో తయారు చేసిన ఈ విగ్రహం 70 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తుల ముందుకువచ్చారు. ఆదివారం రాత్రి పనులు పూర్తి కావడంతో ఇలా దర్శనం ఇచ్చాడు.

- హైదరాబాద్, సెప్టెంబర్ 13



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 107 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 134 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 208 (కిలో) |
| స్కిన్ లెస్ | 235 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

## ఉత్తర తెలంగాణలో

# భారీ వర్షాలు

## నేడు, రేపు వర్ష సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 13 : ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు 9 జిల్లాల్లో జోరు వానలు పడ్డాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో 19.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలోని నెల్లికుదురు, నర్సింహులపేట, మహబూబాబాద్, పెద్దవంగర, దంతాలపల్లితోపాటు పలు -మిగతా 2 లో..





## సైమా అవార్డ్స్-2026

ఉత్తమ నటుడు నాగచైతన్య..
ఉత్తమ చిత్రం 'మిరాయ్' 08

# ఏఐ స్పీడుకు కళ్లెం వేయాల్సిన టైమొచ్చింది

## టెక్ దిగ్గజాలు

**న్యూఢిల్లీ :** కృత్రిమ మేధ శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న తీరు ఆందోళన కలిగిస్తోంది. రానున్న పదేళ్లలో 10 శాతానికి పైగా మనుషులు ఏఐ కారణంగా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని ఆంథ్రోపిక్‌కు చెందిన పరిశోధకుడు ఇవాన్ హుబింగర్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ సైతం కృత్రిమ మేధతో ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఈ సాంకేతిక వేగానికి ఇకనైనా కళ్లెం వేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏఐ సామర్థ్యాల పెంపును తగ్గించాలని కంపెనీలను కోరారు. ఓపెన్‌ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్ , ఎక్స్‌ఏఐ అధిపతి ఎలాన్‌మస్క్ సైతం డారియో అభిప్రాయానికి మద్దతు పలికారు. స్వయంగా తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకునే సూపర్‌ఇంటెలిజెన్స్ వ్యవస్థలను రూపొందిస్తుండడంతో.. తమను తాము మెరుగుపరుచుకునే సామర్థ్యం వ్యవస్థల్లో పెరుగుతోందని డారియో ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో కృత్రిమ మేధకు చెందిన ఏజెంట్లు బాహ్య వ్యవస్థలను యాక్సెస్ చేయడానికి ప్రయత్నిస్తున్న విషయాలను గుర్తు చేశారు. ఏఐని ఇలాగే వదిలేస్తే అది త్వరలోనే స్వయంప్రతిపత్తి గల వ్యవస్థలను సృష్టిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 6–12 నెలల్లో ఆ సమూహం మొత్తం ఇంటర్నెట్‌ను స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదే జరిగితే కొన్ని వందల బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. అయితే, తాను సాంకేతిక పురోగతిని పూర్తిగా నిలిపివేయాలని చెప్పట్లేదన్నారు. దానికి బదులుగా, కంపెనీలు తమ మోడళ్ల భద్రతను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రతా చర్యలను బలోపేతం చేయడానికి ఏఐ కంపెనీలకు మరింత సమయం అవసరమని డారియో పేర్కొన్నారు. కృత్రిమ మేధ వేగానికి బ్రేకులు వేయడానికి మూడు–దశల ప్రణాళికను వివరించారు. ఇరాన్‌కు మద్దతిస్తోన్న యెమెన్‌లోని హూతీలు




క్షిపణులను అభివృద్ధి చేయడానికి తమ ఏఐ చాట్‌బాట్ క్లాడ్‌ను ఉపయోగిస్తున్నట్లు ఆంథ్రోపిక్ ఇటీవల తమ నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో డారియో తాజా హెచ్చరికలు చేయడం గమనార్హం.

డారియో సూచించిన పరిష్కారాలు..

ఏఐ వినియోగంలో భద్రతను ధ్రువీకరించడానికి.. కంపెనీలలో నిరంతరం పర్యవేక్షించే స్వతంత్ర భద్రతా నిపుణుల నియామకం.

భద్రతా ప్రమాణాలను నెలకొల్పడానికి, అనియంత్రిత అభివృద్ధిని నిరోధించడానికి అగ్రగామి ఏఐ సంస్థల మధ్య సమన్వయం.

శక్తిమంతమవుతున్న ఏఐ వ్యవస్థల వల్ల కలిగే ప్రమాదాలను గుర్తించి, ఎదుర్కోవడానికి ప్రపంచ దేశాల మధ్య సహకారం.




## రూల్స్ ఫాలో అవ్వడం కాదు.. సెట్ చెయ్యాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆ రెండింటిని పరస్పర విరుద్ధమైన లక్ష్యాలుగా చూడకూడదు. భారతీయ నాగరికత ఎప్పటినుంచో ప్రకృతిని తల్లిగా భావిస్తూ.. మానవాభివృద్ధికి, పర్యావరణానికి మధ్య సమతుల్యతను పాటిస్తోంది. ఇది భవిష్యత్తు తరాల పట్ల మన బాధ్యతను తెలియజేస్తోంది' అని మోదీ పేర్కొన్నారు. అన్ని దేశాలు కలిసి, బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ ప్రతిపాదించారు. ప్రత్యేక స్టార్టప్ నిధులు ఉండడం వల్ల బ్రిక్స్ దేశాలలోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తల మధ్య మరింత సహకారం పెరిగే అవకాశం ఉందన్నారు. సాంకేతికతను, సంక్లిష్ట ఖనిజాలను చూపి బెదిరింపులకు పాల్పడటాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి చర్యలు సమష్టి వృద్ధికి అడ్డంకులు సృష్టిస్తాయని పరోక్షంగా చైనాను ఉద్దేశిస్తూ పేర్కొన్నారు. అరుదైన ఖనిజాలపై చైనా ఆధిపత్యం చెలాయిస్తున్న నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అక్కడే ఉండడం గమనార్హం. కాగా ప్రపంచంలోని అరుదైన ఖనిజాలలో సుమారు 90శాతం చైనానే ప్రాసెస్ చేస్తుంది. ఈ ఖనిజాలు సోలార్ ప్యానెళ్ల నుంచి స్మార్ట్‌ఫోన్‌ల వరకు అన్నింటిలోనూ ఉపయోగిస్తారు. గతేడాది అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో.. ఈ అరుదైన ఖనిజాల ఎగుమతిపై నిబంధనలను చైనా కఠినతరం చేసింది. తర్వాత ఆ ఆంక్షలలో కొన్నింటిని సడలించింది.



## ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

గుర్తింపు పొందిన ఏకైక నాయకుడు మహాత్మాగాంధీ. ఆయన ఆర్యవైశ్యుల బిడ్డ కావడం దేశానికే గర్వకారణం. లాలాలజపతిరాయ్, సీతారాం కేసరి, పెండేకంటి వెంకటసుబ్బయ్య వంటి ప్రముఖ నాయకులు ఈ సామాజికవర్గం నుంచి వచ్చి కాంగ్రెస్ పార్టీ తరఫున విశేష సేవలు అందించారు. పొట్టి శ్రీరాములు త్యాగంతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. నేను మొదటిసారి ఎమ్మెల్సీగా ఎన్నికై శాసనమండలిలో దూకుడుగా వ్యవహరిస్తున్నప్పుడు రోశయ్య దగ్గరికి పిలిచారు. నా రాజకీయ భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేశారు. ఆవేశంతో కాదు అనుభవంతో ముందుకెళ్తే రాజకీయాల్లో పైకి వస్తావని సుదీర్ఘ భవిష్యత్తు ఉందని ఆశీర్వదించారు. రోశయ్యకు సముచిత గౌరవాన్ని కల్పించాలన్న ఉద్దేశంతో హైదరాబాద్ నడిబొడ్డున విగ్రహం ఏర్పాటు చేస్తే కొంతమంది విమర్శలు చేశారు. 'నాలుగు దశాబ్దాల క్రితమే నేను బల్కంపేటకు వచ్చా.. మంచైనా, చెడైనా నాకు హైదరాబాదే' అని రోశయ్య ఒక సందర్భంగా చెప్పారు. ఆయన మాటలు గౌరవించి నగరంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## ఎప్పుడూ పదవుల కోసం ఆరాటపడలేదు

(మొదటిపేజీ తరువాయి)

పునరుద్ఘాటించారు. విలువలకు కట్టుబడి రాజకీయం చేశామని, రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలనే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. మాజీ ఓఎస్డీ సుమంత్ తండ్రి ఆత్మహత్యాయత్నం చేసుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆయన్ను పరామర్శించేందుకు నియోజకవర్గ కేంద్రానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం తమ అనుచరులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ సుమంత్ బెయిల్ విషయమై హైదరాబాద్‌లో ఉండిపోవడంతో కార్యకర్తలను కలవడం ఆలస్యమైందన్నారు. పార్టీ తనకు మంత్రిగా అవకాశం ఇస్తే మచ్చలేకుండా పనిచేశానని చెప్పారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి కోసం మంత్రి పదవికి రాజీనామా చేశానని.. అప్పుడు తాము బాధపడలేదని, నేడు పదవి పోయినందుకూ బాధ లేదని పేర్కొన్నారు. కానీ అకారణంగా తొలగించారనేది తన వేదన అన్నారు. తనను రాజీనామా చేసి పోటీ చేయాలంటున్న వాళ్లు కార్పొరేటర్‌గా గెలవడం గొప్పన్నారు. ప్రస్తుతం అవకాశవాద రాజకీయాలు ఎక్కువయ్యాయని కొండా దంపతుల గురించి మాట్లాడే నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలంటూ సురేఖ హెచ్చరించారు. చాలారోజుల తర్వాత మైకు దొరికితే ఊగిపోతున్నారని.. ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. రానున్న రోజుల్లో మురళికి ఓ పదవితో పాటు, మళ్లీ తనకు మంత్రి పదవి వస్తుందన్నారు. వచ్చేసారి కూడా వరంగల్ తూర్పు సీటు వందశాతం తనదేనని.. నియోజకవర్గాల పునర్విభజన



జరిగితే తప్ప మారదని చెప్పారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసి వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలోని 24 డివిజన్లు గెలిపించుకుంటామని సురేఖ ధీమా వ్యక్తం చేశారు. కొండా మురళి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి తమకు ఫోన్ వచ్చిన మాట నిజమేనన్నారు. పదవి ఉంటుంది.. పోతుంది.. ఎన్నడూ క్షమాపణ చెప్పలేదని పేర్కొన్నారు. బీసీల కోసం ముందుకొచ్చే నాయకుడు లేకుండా పోయారన్నారు. కృతజ్ఞత అనేది కొండా రక్తంలోనే ఉందని.. పార్టీలోనే కొనసాగుతామన్నారు. 'నాది.. సురేఖది ఒకటే మాట. నా బిడ్డది వేరే మాట. ఆమె వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నేను కబ్జాలు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. కార్యకర్తల కోసం అవసరమైతే మరో పదెకరాలు అమ్ముతా' అని అన్నారు. రేవంత్‌రెడ్డికి తన గురించి అన్నీ తెలుసని మురళి వ్యాఖ్యానించారు.



## దేశ భద్రత విషయంలో రాజీ పడేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

మార్చివేసి, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తోందని గుర్తుచేశారు. ఐదు బలహీన ఆర్థిక వ్యవస్థల జాబితా నుంచి దేశాన్ని ఐదు అగ్ర దేశాల జాబితాలోకి చేర్చామని చెప్పారు. ఈ సందర్భంగా ఈ ఏడాది తొలి త్రైమాసికంలో నమోదైన 7.8% జీడీపీ వృద్ధిని ప్రస్తావించారు. దేశ అంతర్గత భద్రతకు సవాళ్లు విసురుతూ వస్తున్న ఆర్టికల్ 370, నక్సలిజం, ఈశాన్య రాష్ట్రాల్లో అశాంతి వంటి సమస్యలను తమ ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని తెలిపారు. ప్రజాసేవలో ప్రధాని మోదీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్'ను చేపట్టనున్నట్లు అమిత్ షా పేర్కొన్నారు.



## ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. వరంగల్ జిల్లాలోని రాయపర్తి, వర్ధన్నపేట, పర్వతగిరి, నెక్కొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు, రామన్నపేట, చౌటుప్పల్, చిట్యాల, వెలిగొండ, అడ్డగూడూరు, సూర్యాపేట జిల్లాలోని జాజిరెడ్డిగూడెం, నాగారం, మద్దిరాల, తిరుమలగిరి మండలాల్లో భారీగా కురిశాయి. వాగులు, వంకలు పొంగి పొర్లి.. చెరువులు నిండుకుండలా మారాయి. పలు మండలాల్లో పంటలు నీట మునిగాయి. రోడ్లు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్లా ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. సోమ, మంగళవారాల్లోనూ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది.

# వడివడిగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు పనులు

### డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియ వేగవంతం

### వారం రోజుల్లో ముగ్గురు నోడల్ అధికారుల నియామకం

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆధ్వర్యంలో సమీక్ష

**న్యూఢిల్లీ:** రక్షణ, వాణిజ్యపరంగా అత్యంత వ్యూహాత్మకమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులను వేగంగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు పురోగతిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో శనివారం ఢిల్లీలో ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ భేటీలో పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రాజెక్టు అమలును పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు రక్షణ శాఖ, పౌరవిమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే ప్రాజెక్టు డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తీర్మానించారు. ఉత్తర తెలంగాణలో పౌర విమానయాన మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రాంతీయ వైమానిక అనుసంధాన మెరుగుదలకు ఈ ప్రాజెక్టు బాటలు వేస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ రక్షణపరంగా వ్యూహాత్మక ప్రాంతమైన ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్



ఎయిర్‌ఫీల్డ్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ అభివృద్ధికి రక్షణ శాఖ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరే దిశగా కీలక ముందడుగు పడిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 17న రక్షణ, పౌర విమానయాన శాఖల అధికారులు ఆదిలాబాద్ విమానాశ్రయ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ కోసం 2.75 కిలోమీటర్ల పొడవైన రన్‌వే నిర్మాణం అవసరమని తేల్చారు. ప్రస్తుతం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధీనంలో 369.45 ఎకరాల భూమి అందుబాటులో ఉండటంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూసేకరణ చేయాలని అధికారులు నిర్ణయించారు.



## వసంతనగర్‌లో వినాయక మట్టి విగ్రహాల పంపిణీ

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 13, (జనం వార్త) : కూకట్‌పల్లి నియోజకవర్గం వసంత నగర్ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో స్థానికకాలనీ వాసులకు వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై స్థానికులకు వినాయక మట్టి విగ్రహాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగాహొప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని, సంస్కృతిని కాపాడాలంటే మట్టి గణనాథుల్ని పూజించాలన్నారు.హొమట్టి గణనాధులను ఇంట్లోని స్వచ్ఛమైన నీటిలో నిమజ్జనం చేసి ఆ మట్టిని మొక్కలకు వేయటం ద్వారాహొపర్యావరణహితము, మొక్కలకు ఎరువు ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిలారి బాబు,కాకర్ల సురేష్ చౌదరి, లక్ష్మయ్య,చావా శ్రీనివాసరావు ,కొదప రామారావు, కాజా నవీన్, చిలుకూరి గోవిందరాజు, రామ్ చౌదరి, శ్రీనివాస్, నల్లమోతు ఫణి, శేషారావు, సురేష్, గంటా భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## శాశ్వత వినాయక మండపాన్ని ప్రారంభించిన మాజీ కౌన్సిలర్

### గూడూరు సబిత ఆంజనేయ గౌడ్ ను సన్మానించిన కాలనీవాసులు

**నాగారం,సెప్టెంబర్ 13(జనంవార్త) :** నాగారం డివిజన్ పరిధిలోని సాయి నివాస్ కాలనీలో శాశ్వత వినాయక మండపాన్ని కాలనీవాసులు నూతనంగా నిర్మించుకున్నారు. ఈ శాశ్వత వినాయక మండప ప్రారంభోత్సవానికి మాజీ స్థానిక కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మండప నిర్మాణానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన మాజీ కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అనంతరం కాలనీవాసులు మాజీ కౌన్సిలర్ ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఎం.గోవింద్, ఉపాధ్యక్షులు బి.రవి, కోశాధికారి శ్రీహరి, కార్యదర్శి మహేష్, కాలనీ వాసులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను పూజిద్దాం

### భక్తుకు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పిలుపు

### రాంపల్లిలో ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ

**నాగారం, సెప్టెంబర్ 13 (జనం వార్త) :** మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి భక్తులకు పిలుపునిచ్చారు. ఆదివారం రాంపల్లిలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపణి కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు వినాయక ప్రతిమలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని రక్షించుకోవాలన్న మంచి సందేశాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని ఆయన సూచించారు. పర్యావరణహితంగా పండగ జరపుకోవాలని ప్రజలకు కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టివినయకులను పూజిద్దాం..

### పర్యావరణాన్ని కాపాడుద్దాం : డాక్టర్ హేమారాజ్ సింగ్

**దుబ్బాక సెప్టెంబర్ 13( జనం వార్త) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సుపారీడెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ దుబ్బాక ప్రాంత ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ మట్టి వినాయకులనే పూజించాలాని వారు సూచించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుకుందాం,మట్టి గణపతులను పూజించి కాలుష్యన్ని నివారిద్దాం అని అన్నారు.భారీ వినాయకులను తెచ్చేటప్పుడు రోడ్డు పై గుంతలు చూసుకుంటా



జాగ్రత్తగా తీసుకురావాలని విద్యుత్ వైర్లు తాగులకుండ యువత జాగ్రత్తలు పాటిస్తూ తీసుకురావాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వినాయక నవరాత్రుల ఉత్సవాల భాగంగా ప్రతి చోట వినాయకుల మండపాల వద్ద నిర్వాహ కులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి మండపాల వద్ద వాలంటీర్లను ఏర్పాటు చేసుకొని నిరంతరం పర్య వేక్షణ చేపట్టాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ విషయంలో నిర్లక్ష్యం వహించాలని. నాసి రకం వైర్లను వినియోగించకుండా అధికారిక అనుమతులతో విద్యుత్ కలెక్షన్ పొందాలని ప్రతి యువతను ఆయన కోరారు.

# ఆత్మాభిమానానికి ప్రతిరూపం ఆర్యవైశ్యులు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 13(జనంవార్త) :** ఆర్యవైశ్యులు సౌమ్యులు,ఆత్మాభిమానం అధికంగా ఉన్నవాళ్లు అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు.ఆదివారం ఉప్పల్ బగాయతులో ఆర్యవైశ్య ఆత్మగౌరవం భవన నిర్మాణ సముదాయానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల్లో చాలా మంది పేదలున్నప్పటికీ ఆత్మగౌరవం కోసం పేదలుగా గుర్తింపు తెచ్చుకోవడానికి ఇష్టపడరని అన్నారు.కష్టాలు, బాధలు ఉన్నా సమాజంలో గౌరవం కోసం జీవించేవాళ్లు ఆర్యవైశ్యులు అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసించారు. తాను ఎప్పుడూ ఆర్యవైశ్యుల శ్రేయోభిలాషినే అని స్పష్టం చేశారు.గ్రామంలో ఎంత పేదవాడు పోయినా కనీసం తినడానికి అప్పు ఇచ్చే వాళ్లు ఆర్యవైశ్య సోదరులు అని,గ్రామంలో ఏ శుభకార్యం ఉన్నా మొదట గుర్తుకు వచ్చేది ఆర్యవైశ్య సోదరులే అని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఉన్నవి రెండే వృత్తులు అవి వ్యవసాయం, వ్యాపారం.మాజీ ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, వైఎస్‌లు గల్లాపెట్టె నిర్వహణ బాధ్యతను కొనిజేటి రోశయ్య కే అప్పగించారని అన్నారు. జూన్ 2, 2014న తెలంగాణ ఏర్పాటు అయిన నాడు 16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ఏర్పడిందంటే కారణం ఆనాటి ఆర్థిక మంత్రి రోశయ్య,రోశయ్యకు అవకాశం,గౌరవం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ శాసనమండలిలో దూకుడుగా నేను మాట్లాడితే రోశయ్య నన్ను పిలిచి ఆవేశం తగ్గించుకుని అనుభవంతో ముందుకు వెళ్తే పైకి వస్తామని, ఉజ్వల భవిష్యత్తు ఉందని తను ఆశీర్వదించిన మొట్టమొదటి వ్యక్తి కొణిజేటి రోశయ్య అని సీఎం గుర్తు చేశారు.

### నన్ను ముందు గుర్తించింది రోశయ్య

రోశయ్య విమర్శించే వారు కాదు, తిట్టే వారు కాదు. రోశయ్య చురకలు వేసేవారు.రాష్ట్రం విడిపోయినా రోశయ్య గౌరవాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో హైదరాబాద్ నడిబొడ్డున ఆయన విగ్రహం ఏర్పాటు చేశాం అని స్పష్టం చేశారు. రోశయ్య విగ్రహం ఏర్పాటు పైన కొంతమంది విమర్శలు చేశారు.నాలుగు దశాబ్దాల క్రితమే నేను హైదరాబాద్‌కు వచ్చాను.మంచైనా, చెడైనా నాది ఇక హైదరాబాద్ అని రోశయ్య అన్న మాటలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తుతించారు. భారతదేశం నుంచి ప్రపంచస్థాయి నాయకుడిగా ఎదిగిన ఆర్యవైశ్య బిడ్డ మహాత్మా గాంధీ.ప్రపంచస్థాయి నేతగా గుర్తింపు తెచ్చుకున్న మహాత్మా గాంధీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావడం గర్వకారణం. అనేక మంది ఆర్యవైశ్య ప్రముఖులు కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారు.పొట్టి శ్రీరాములు పోరాటం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది.దేశ సమగ్రత కోసం మహాత్మాగాంధీ ప్రాణాలు ఇస్తే, పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించారు.



### ఆర్యవైశ్యులకు రావాల్సిన గుర్తింపు రాలేదు

ఆర్యవైశ్యుల పట్ల మా ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. పేదల ఆర్యవైశ్య బిడ్డలకు ఆత్మగౌరవ భవనం సంపూర్ణంగా ఉపయోగపడాలి.రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణం కోసం ఆర్థిక సహాయం కూడా అందిస్తుంది.నేను మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తా,కలిసి ఉంటేనే మీకు బలం,సమైక్యంగా ఒక్కతాటిపై నడిస్తే అందరూ గౌరవిస్తారని పరోక్షంగా చురకలనిటించారు. ఆర్యవైశ్యులకు ఒక కార్పొరేషన్ పదవి ఇచ్చాం.కొడంగల్‌లో ఒక మున్సిపాలిటీలో ఆర్యవైశ్య కులానికి చైర్మన్ పదవి ఇచ్చాం. రాజకీయాల్లో మీ వాటా మీరు తీసుకోవాలి.. కలిసి కట్టుగా ఉన్నప్పుడు ఇది సాధ్యమౌతుంది.ఆర్యవైశ్యులకు ముందు చూపు, జాగ్రత్త వాళ్ల డీఎన్ఏలోనే ఉంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు,మాజీ ఎమ్మెల్యేలు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష కార్యదర్శులు బిల్దే రమేష్ గుప్తా, బచ్చు నగేష్ గుప్తా, రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఆర్యవైశ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తితో పాటు ప్రకృతి పరిరక్షణే లక్ష్యం

### బలరాం యాదవ్

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 13(జనం వార్త):** పండుగల సమయంలో భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ శ్రీరాంనగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బలరాం యాదవ్ పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా శ్రీరాంనగర్‌లో ఆయన పర్యావరణహిత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం యాదవ్ మాట్లాడుతూ మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అనంతరం గంగాజలంలో నిమజ్జనం చేయడం మన సంప్రదాయమని అన్నారు. అయితే మారుతున్న పరిస్థితుల్లో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే వారి సంఖ్య తగ్గిపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రకృతిని కాపాడి



తేనే రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా తనవంతు కృషిగా 'ఎకో ఫ్రెండ్లీ గణేష్' కార్యక్రమాన్ని చేపట్టి చిన్నారులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. చిన్నారుల నుంచే పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.



## సరస్వతి శిశుమందిర్‌లో ఉపాధ్యాయుల శిక్షణ

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 13 (జనం వార్త):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో రెండు రోజుల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణకు పూర్వ పాలమూరు జిల్లాలోని 28 పాఠశాలల నుంచి సుమారు 250 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ కార్యవాహ పత్తికొండ రాము మాట్లాడుతూ సరస్వతి శిశుమందిర్‌లు సంస్కార నిలయాలని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు సంస్కారం, దేశభక్తి, దైవభక్తి, పరోపకారం, నైతిక విలువలు, కుటుంబ విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో విభాగ కార్యదర్శి ఎల్లప్ప, పాఠశాల అధ్యక్షులు వాస రమేష్ బాబు, జిల్లా అధ్యక్షులు మిడిదొడ్డి శివశంకర్, ప్రతినిధులు కందూరు బాలరాజు, మిడిదొడ్డి నాగరాజు, కందాల రవీంద్రాచారి, కొండె కృష్ణమోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

## హత్య కేసు ఛేదించిన పోలీసులు

### భార్యతో అక్రమ సంబంధం నేపథ్యంలో భర్తను హత్య చేసిన వ్యక్తి.. కుట్రలో భార్య సహకారం

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 13 (జనం వార్త):** నాగర్‌కర్నూల్ పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో చోటుచేసుకున్న దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. భార్యతో అక్రమ సంబంధం నేపథ్యంలో ఆమె భర్త మహ్మద్ కరీం (43)ను గౌస్ పాషా అనే వ్యక్తి గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ హత్యకు మృతుడి భార్య సలీమా బేగం సహకరించినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సలీమా బేగం, గౌస్ పాషా మధ్య గత రెండేళ్లుగా అక్రమ సంబంధం కొనసాగుతోంది. ఈ విషయం తెలిసిన కరీం భార్యను పలుమార్లు మందలించడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. సుమారు రెండు నెలల క్రితం ఈ వ్యవహారంపై పంచాయితీ నిర్వహించగా, పెద్దలు గౌస్ పాషాను మందలించారు. దీంతో కరీంను చంపేస్తానని అప్పట్లో గౌస్ పాషా బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. కరీంను హత్య చేసేందుకు గౌస్ పాషా ముందస్తు ప్రణాళిక రూపొందించాడు. రహదారి పక్కన కొనుగోలు చేసిన కత్తిని ఇంట్లో దాచుకున్నాడు. అనంతరం వాట్సాప్ కాల్స్ ద్వారా సలీమా బేగంతో కలిసి హత్యకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆస్తి సలీమా పేరుపై ఉండటంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని ఇద్దరూ నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. సలీమా నెల్లూరు దర్గాకు వెళ్లిన సమయంలో హత్యకు పథకం అమలు చేసినట్లు వెల్లడించారు. పథకం ప్రకారం గౌస్ పాషా కరీం ఇంటికి వెళ్లి డోర్ బెల్ కొట్టాడు. నిద్రమత్తులో ఉన్న కరీం తలుపు తీయగానే అతడిపై కత్తితో దాడి చేసి గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. వెళ్తూ మార్గమధ్యంలో హత్యకు



ఉపయోగించిన కత్తితో పాటు చెప్పులు, బట్టలు, గ్లాసులు పడేసినట్లు పోలీసులు తెలిపారు. హత్య కేసు దర్యాప్తులో భాగంగా మృతుడి భార్య సలీమా బేగంను అదుపులోకి తీసుకుని విచారించగా కుట్రకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. సలీమా ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా గౌస్ పాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో కరీంను తానే హత్య చేసినట్లు గౌస్ పాషా అంగీకరించినట్లు తెలిపారు. ఈ కేసులో గౌస్ పాషాను ఏ-1 నిందితుడిగా, సలీమా బేగంను ఏ-2 నిందితురాలిగా గుర్తించి ఇద్దరినీ అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు ఛేదింపుపై డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు మీడియాకు వివరాలు వెల్లడించారు. దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించిన సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ వెంకట్ రెడ్డితో పాటు ఐడీ పార్టీ సిబ్బంది వెంకటేష్, భీముడు, రమేష్‌లను డీఎస్పీ అభినందించారు.



## లడ్డూల తయారీలో 4 దశాబ్దాల అనుభవం

### వట్టెం వెంకటేష్‌కు ప్రత్యేక గుర్తింపు

**బిజినపల్లి వట్టెం, సెప్టెంబర్ 13 (జనం వార్త):** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన వెంకటేష్ లడ్డూల తయారీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. దాదాపు 40 సంవత్సరాల క్రితమే లడ్డూల తయారీని ప్రారంభించిన ఆయన, నేటికీ అదే వృత్తిని కొనసాగిస్తూ ఎంతోమంది అభిమానం పొందుతున్నారు. వెంకటేష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామ్‌నగర్ గుండు గ్రామంలో నివాసం ఉంటూ అక్కడ కూడా లడ్డూల తయారీలో మంచి పేరు సంపాదించారు. నాణ్యమైన పదార్థాలతో, రుచికరంగా లడ్డూలను తయారు చేస్తూ వినియోగదారుల ఆదరణను పొందుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా లడ్డూల తయారీలో కొనసాగుతున్న వెంకటేష్ తన అనుభవం, నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందడం విశేషం. ఆయన దగ్గరికి వందలాది మంది వచ్చి లడ్లు కొనుగోలు చేసుకుని పోవడం విశేషం,ప్రత్యేకంగా స్వగ్రామమైన వట్టెం నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం హైదరాబాద్ వరకు విస్తరించడం స్థానికంగా పలువురిని ఆకట్టుకుంటోంది.

# మతిమరుపు వచ్చేసిందా?

గదిలోకి ఎందుకు వచ్చానబ్బా?"బైక్ తాళం చెవి ఇక్కడే పెట్టానే, కనిపించటం లేదేం?"ఈ అబ్బాయి పేరేంటో, అడిగితే బాగుండదేమో!"ఇప్పటివరకూ నోట్లో నానుతూనే ఉందే, అదేంటో చప్పున గుర్తురాదేం?'ఇలాంటి అనుభవాలు తరచూ ఎదురయ్యేవే. ఉన్నట్టుండి మెదడు మొద్దుబారటం.. ఉన్నట్టుండి వస్తువులు, మనుషుల పేర్లు మరచిపోవటం మామూలే. వాక్యాలను పూర్తి చేయలేక, పదాలు తట్టక సతమతం కావటం.. దుకాణానికి వెళ్లి ఏం కొనాలో మరచిపోవటం చూస్తూనే ఉంటాం. దీనికి వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారిలోనూ కనిపిస్తూనే ఉంటుంది. దీంతో అప్పుడే మతిమరుపు వచ్చేసిందా? డిమెన్షియా, అల్జీమర్స్ దాడి చేస్తున్నాయా? అని కలవరపడుతుంటారు కూడా.

అప్పుడప్పుడూ మరచిపోవటానికి నిద్రలేమి, విశ్రాంతి కొరవడటం, మద్యం తాగటం వంటివి దారితీస్తుంటాయి. హఠాత్తుగా, ఏదైనా కడుపు నిండా తిన్న తర్వాత రక్తసరఫరా మెదడు నుంచి జీర్ణాశయానికి మళ్లటంతోనూ ఇలా జరగొచ్చు. కొన్ని మందులు.. ముఖ్యంగా అలర్జీ తగ్గించేవి, దగ్గు మందులు, కండరాలను వదులు చేసేవి, కొన్ని నొప్పి మాత్రల వంటివీ మరపు తెచ్చిపెట్టొచ్చు.

మరో ముఖ్యమైన కారణం హార్మోన్ల మార్పులు. శరీరంలోని దాదాపు అన్ని అవయవాలు.. ముఖ్యంగా మెదడు సమర్థంగా పనిచేయటానికి థైరాయిడ్ హార్మోన్లు కీలకం. వీటి లోపం మతిమరుపు తెచ్చిపెట్టొచ్చు. థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోతే బరువు పెరగటం, చర్మం పొడిబారటం, మలబద్ధకం, నిస్సత్తువ వంటి ఇతరత్రా లక్షణాలూ కనిపిస్తాయి.

మహిళల్లో గర్భం ధరించినప్పుడు, నెలసరి నిలిచినప్పుడు ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల మధ్య సమతుల్యత లోపిస్తుంది. ఇలాంటి సమయాల్లో కొద్ది నెలల పాటు మతిమరుపుతో ఇబ్బంది పడుతుంటారు. ఇది తాత్కాలికమే. కొద్దిరోజులకు అదే కుదురుకుంటుంది.

భయపడకుండా, బాధపడకుండా ఆయా ఘటనలు, సందర్భాలను నిశితంగా పరిశీలిస్తే తాత్కాలిక మతిమరుపు ఎందుకొచ్చిందనేది చాలామంది తమకు తామే గుర్తించగలరు. తలకు దెబ్బలు తగలటం, జబ్బులు రావటం, తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవటం వంటివి దీనికి దారితీస్తున్నట్టు తెలుస్తూనే ఉంటుంది. లక్షణాలు విడవకుండా వేధిస్తున్నా వెంటనే గాబరా పడాల్సిన పనిలేదు. మానసిక సమస్యేమో, అల్జీమర్స్, డిమెన్షియా వచ్చిందేమోనని చింతించటానికి బదులు ముందుగా కొన్ని పరీక్షలు చేయించుకోవటం మంచిది. రక్తంలో ఐరన్, థైరాయిడ్, బి విటమిన్లు.. ముఖ్యంగా బి12 పరీక్షలు చేయించుకోవాలి. లక్షణాలు తీవ్రమవుతున్నా లేదా రోజురోజుకీ ఎక్కువవుతున్నా మెదడు సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షలు అవసరమవుతాయి.

## డిమెన్షియా హెచ్చరిస్తుంది

తీవ్ర మతిమరపును తెచ్చిపెట్టే డిమెన్షియా తీరే వేరు. ఇది కొన్ని హెచ్చరిక సంకేతాలు ఇస్తుంటుంది. సాధారణంగా ఇందులో మరపు తీవ్రంగా ఉంటుంది. ముఖ్యంగా తక్షణ విషయాలు, సంఘటనలు గుర్తుండవు. భవిష్యత్తు ప్రణాళికలు వేసుకోలేకపోవటం, అంచెలంచెలుగా ఆలోచించి తేలికగా పరిష్కరించగల సమస్యల విషయంలోనూ ఇబ్బంది పడటం కనిపిస్తుంటాయి. రోజూ చేసే, తెలిసిన పనులను చేయటానికీ కష్టపడుతుంటారు. తేదీలు, సమయం గుర్తించటంలోనూ తికమక పడుతుంటారు. కొందరు నలుగురితో కలవటానికీ వెనకాడటం చూస్తుంటాం. చిరాకు, కోపం, ఆందోళన, నిరాశ, దిగులు వంటివీ తలెత్తొచ్చు. ఇలాంటి లక్షణాలను చాలావరకూ కుటుంబ సభ్యులే పసిగడుతుంటారు. వీటిని గమనిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది. మతిమరపు రావటానికి సరిదిద్దుకోదగిన కారణం ఉన్నట్టు తేలితే తగు చికిత్స తీసుకుంటే గణనీయమైన ఫలితం కనిపిస్తుంది. లక్షణాలు వెనక్కి మళ్లొచ్చు కూడా.





## మెదడు ఆరోగ్యంపై దృష్టి

- వయసు మీద పడుతున్నకొద్దీ కొంత మేధాశక్తి తగ్గటం, ఎంతోకొంత మతిమరపు సహజం. కాబట్టి మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి.
- మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి జీవనశైలి జబ్బులను అదుపులో ఉంచుకోవాలి.
- రోజూ పండ్లు, కూరగాయలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం తినాలి.
- విటమిన్ డి, క్యాల్షియం తగ్గితే భర్తీ చేసుకోవాలి.
- వయసు మీద పడుతున్నకొద్దీ బి విటమిన్లను సంగ్రహించుకునే శక్తి తగ్గుతుంది. మెట్‌ఫార్మిన్ వంటి మందులతోనూ ఇలా జరగొచ్చు. కాబట్టి బి విటమిన్లను తీసుకోవాలి.
- ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలూ మేలు చేస్తాయి.
- రోజుకు కనీసం 40 నిమిషాలు వ్యాయామం, శారీరక శ్రమ చేయాలి. దీంతో మెదడుకు తగినంత రక్తం సరఫరా అవుతుంది. కండరాల నుంచి మేలు చేసే రసాయనాలు విడుదలై, మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.
- నలుగురితో కలవటం, పుస్తకాలు చదవటం, పజిల్స్ పూరించటం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవటం వంటి పనులతో మెదడును చురుకుగా ఉంచుకోవాలి.
- రోజుకు 7–8 గంటల సేపు నిద్రించాలి. దీంతో మెదడుకు తగినంత విశ్రాంతి లభించి, పునరుత్తేజితమవుతుంది.
- మానసిక ఒత్తిడి మేధాశక్తిని గణనీయంగా దెబ్బతీస్తుంది. కాబట్టి దీన్ని అదుపులో ఉంచుకోవాలి. మనం మార్చటానికి వీల్లేని పరిస్థితుల గురించి అదేపనిగా ఆలోచించటం, బాధపడటం మానెయ్యాలి. శ్వాస మీద ధ్యాస పెట్టి చేసే ధ్యానం, ప్రాణాయామం మనసు తేలిక పడటానికి తోడ్పడతాయి.

# నిద్రవేళలు మారుతున్నాయా?

తరచూ రాత్రి షిఫ్టుల్లో పనిచేస్తున్నారా? వేర్వేరు టైమ్ జోన్లకు మారుతున్నారా? కాస్త జాగ్రత్త. ఇలా మాటిమాటికీ నిద్రవేళలు మారిపోవటం ప్రమాదకరమని, దీంతో మహిళల్లో తీవ్ర రొమ్ముక్యాన్సర్ ముప్పు పెరుగుతోందని అమెరికా అధ్యయనం చెబుతోంది. నిద్రవేళలు మారితే శరీరంలోని జీవగడియారం అస్తవ్యస్తమవుతుంది. ఇది రొమ్ముల్లోని క్షీరగ్రంథుల ఆకృతిని మారుస్తున్నట్టు, రోగనిరోధక వ్యవస్థ బలహీనమవుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఇది రొమ్ముక్యాన్సర్ ముప్పు పెరిగేలా చేస్తున్నట్టు కనుగొన్నారు. జీవగడియారం కేవలం నిద్ర వేళలను నియంత్రించటమే కాకుండా హార్మోన్ల విడుదలను సమన్వయం చేయటం, కణజాలాల మరమ్మతు, రోగనిరోధక వ్యవస్థ నిఘాలోనూ సాయం చేస్తుంది. అంటే జీవగడియారం అస్తవ్యస్తమైతే సహజ రక్షణ వ్యవస్థ గతి తప్పుతుందన్నమాట. దీంతో శరీరానికి హాని చేసేవాటిని గుర్తించే సామర్థ్యమూ తగ్గుతుంది. ఫలితంగా తీవ్ర రొమ్ముక్యాన్సర్ ముప్పు పెరుగుతోందని పరిశోధకులు చెబుతున్నారు. నిద్రవేళలు మారటం వల్ల కణితులు త్వరగా వృద్ధి చెందటమే కాకుండా క్యాన్సర్ కణాలు మనుగడ సాగించటానికి, ఇతర భాగాలకు వ్యాపించటానికి అనువైన వాతావరణం ఏర్పడుతోందనీ వివరిస్తున్నారు.



# వినాయక చవితికి ముందు..
# గౌరీపూజ ఎందుకు?

## సౌభాగ్యం, మంగళం, సంపదకు ప్రతీకగా గౌరీదేవి ఆరాధన

## గౌరీపూజ మరుసటి రోజే గణేశ చతుర్థి.. మహిళలకు ప్రత్యేకమైన పూజా సంప్రదాయం



వినాయక చవితి వచ్చిందంటే ప్రతి ఇంటా పండుగ సందడి మొదలవుతుంది. వినాయకుడి ప్రతిష్ఠకు ముందు రోజు అనేక ప్రాంతాల్లో గౌరీదేవిని ప్రత్యేకంగా పూజించడం ఆనవాయితీగా వస్తోంది. అసలు వినాయక చవితికి ముందు గౌరీపూజ ఎందుకు చేస్తారు? గౌరీదేవికి, గణేశుడికి ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలు తెలుసుకోవడం ఆసక్తికరం.

శక్తికి మూలంగా, మంగళానికి ప్రతీకగా గౌరీదేవిని భక్తులు ఆరాధిస్తారు. ముఖ్యంగా వివాహిత మహిళలు గౌరీపూజను సౌభాగ్యాన్ని ప్రసాదించే పూజగా భావిస్తారు. గౌరీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల కుటుంబంలో సుఖసంతోషాలు, ఆనందం, ఐశ్వర్యం కలగడంతో పాటు భర్తకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం.



భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో గౌరీ పండుగ, గౌరీ చౌతి, గౌరీ గణేష్ వంటి పేర్లతో ఈ పండుగను జరుపుకుంటారు. వరమహాలక్ష్మి వ్రతం తరహాలోనే గౌరీపూజను నిర్వహిస్తారు. అయితే వరమహాలక్ష్మి పూజలో లక్ష్మీదేవిని ఆరాధిస్తే, ఈ పూజలో గౌరీదేవిని మంగళప్రదాయినిగా భావించి పూజించడం ప్రత్యేకత. గౌరీపూజలో భాగంగా అమ్మవారి రూపాన్ని పసుపుతో తయారు చేసి అలంకరించడం, బియ్యం లేదా ధాన్యాలతో కలశాన్ని ఏర్పాటు చేయడం, పూలు, పండ్లు తదితరాలను సమర్పించి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ముఖ్యంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి కుటుంబ సౌభాగ్యం, శాంతి, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తారు.

### గౌరీపూజ తర్వాతే గణేశుడి ఆరాధన

గౌరీపూజ మరుసటి రోజు భాద్రపద శుద్ధ చవితి సందర్భంగా గణేశ చతుర్థి పర్వదినాలు ప్రారంభమవుతాయి. జ్ఞానం, వివేకం, ఐశ్వర్యం, ఆరోగ్యం, దీర్ఘాయుష్షు, విజయాలను ప్రసాదించే దేవుడిగా గణేశుడిని భక్తులు కొలుస్తారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిగా గణపతిని పూజిస్తూ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. కుటుంబ సంప్రదాయాలను బట్టి గణేశ చతుర్థిని ఒక రోజు, మూడు రోజులు, ఏడు రోజులు లేదా పది రోజుల పాటు నిర్వహిస్తారు. కొందరు గౌరీదేవి విగ్రహంతో పాటు గణేశుడిని ఇంటికి తీసుకొచ్చి పూజిస్తారు. మరికొందరు గౌరీదేవి విగ్రహాలతో పాటు మరో రెండు గౌరీ రూపాలను గణేశుడి సోదరీమణులుగా భావించి ఆరాధిస్తారు. ఇలా ముందుగా గౌరీదేవిని పూజించి, ఆ తర్వాత విఘ్నేశ్వరుడిని ఆరాధించడం ద్వారా శక్తి, మంగళం, జ్ఞానం, సౌభాగ్యం, సంపద తమ కుటుంబాల్లో నిండాలని భక్తులు ఆకాంక్షిస్తారు. ప్రాంతాలు, కుటుంబ సంప్రదాయాలను బట్టి ఆచారాల్లో స్వల్ప మార్పులు ఉన్నప్పటికీ గౌరీ–గణేశుల ఆరాధనకు భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉంది.



- గౌరీదేవిని వినాయకుడికి ముందుగా పూజించడం వెనుక ప్రధానంగా కుటుంబసౌభాగ్యం, శక్తి, మంగళం అనే భావన ఉంది.
- గౌరీదేవి = శక్తి, మంగళం, సౌభాగ్యానికి ప్రతీక. పార్వతీదేవినే గౌరీగా ఆరాధిస్తారు.
- వినాయకుడు = గౌరీదేవి కుమారుడు. అందువల్ల తల్లిని ముందుగా ఆరాధించి, ఆ తర్వాత కుమారుడైన గణేశుడిని పూజించడం ఒక సంప్రదాయంగా ఏర్పడింది.
- ముఖ్యంగా వివాహిత మహిళలు గౌరీపూజను కుటుంబ సౌభాగ్యం, భర్తకు ఆయురారోగ్యాలు, కుటుంబ శ్రేయస్సు కోసం నిర్వహిస్తారు.
- గౌరీపూజ ద్వారా ముందుగా శక్తి, మంగళం, సౌభాగ్యాన్ని కోరుకుని, మరుసటి రోజు వినాయకుడిని పూజించి విఘ్నాలు తొలగి జ్ఞానం, విజయం, ఐశ్వర్యం కలగాలని ప్రార్థిస్తారు. అందుకే కొన్ని ప్రాంతీ య సంప్రదాయాల్లో "ముందు గౌరీ.. తర్వాత గణేశుడు" అనే క్రమం కనిపిస్తుంది. అయితే ఇది అన్ని ప్రాంతాల్లో తప్పనిసరిగా పాటించే ఒకే విధమైన శాస్త్ర నియమం కాదు. గౌరీపూజ, గణేశ చతుర్థి ఆచారాలు ప్రాంతం, కుటుంబ సంప్రదాయం, ఆగమ/స్థానిక పద్ధతులను బట్టి మారుతాయి. సరళంగా చెప్పాలంటే:
- గౌరీ = శక్తి, మంగళం, సౌభాగ్యం → గణేశుడు = జ్ఞానం, విఘ్ననివారణ, విజయం.
- అందుకే ముందుగా అమ్మవారిని పూజించి, అనంతరం కుమారుడైన వినాయకుడిని ఆరాధించే సంప్రదాయం ఏర్పడింది.





### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినాయకుడి విగ్రహం అందజేత

#### ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహం అందజేత

**ఉప్పల్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం నాయకులు వినాయకుడి విగ్రహాన్ని అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ సమక్షంలో ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం నాయకులు పాలడుగు సంపత్ కుమార్ గుప్తా తదితరులు ముఖ్యమంత్రికి వినాయకుడి విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి పండగ
# పర్యావరణహితంగా సాగాలి

(వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక కథనం)

వినాయక చవితి మన భారతీయ సమాజంలో భక్తి ఐక్యత ఉత్సాహాన్ని ప్రతీకగా నిలిచే పండుగ . విఘ్నాలను తొలగించే వినాయకుడిని పూజించడం మన సంప్రదాయంగా వస్తుంది అయితే కాలానుగుణంగా పండుగల నిర్వహణలో ఎన్నో మార్పులు వచ్చాయి భక్తి, ఆధ్యాత్మికత, సాంప్రదాయం,కంటే ఆర్భాటం, పోటీ ప్రదర్శన, ఎక్కువ అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 25 నుండి 30 వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుందని కొన్ని నివేదికలు తెలుపుతున్నాయి ఈ నేపథ్యంలో వినాయక చవితి పర్యావరణహితంగా జరుపుకో లేమా? అన్న ప్రశ్న చవితి స్వాతంత్ర్యం కోసం పోరాడే వారందరినీ ఒక జెండా కిందికి తీసుకువచ్చి ప్రజలలో దేశభక్తిని పెంపొందించే స్థలం చైతన్యం కలిగించడం జరిగింది వినాయక చవితి 1893 ముందు ఎక్కువ ఇళ్లలో జరుపుకునే ఆచార పద్ధతిగా ఉండేది. బాల గంగాధర తిలక్ దానిని సామాజిక ఉత్సవంగా మార్చి సమాజంలో అన్ని వర్గాల హిందువులను ఒకటిగా చేసే ప్రయత్నం చేశారు జాతీయ ఉద్యమంలో వినాయక చవితి సామూహిక పండుగగా మార్చిన ఘనత లోకమాన్య బాలగంగాధర్ తిలక్ దే బ్రిటిష్ పరిపాలనలో ప్రజలను ఒక వేదికపైకి తీసుకురావడం కష్టమైన సమయంలో ఆయన వినాయక చవితిని ఒక జాతీయ పండుగగా మార్చారు ప్రజలు గుమికుడి పూజలు చేయడం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం స్వాతంత్ర్య పోరాటాలు జాతీయ గీతాలు జాతీయ చైతన్యం విస్తరించడం వలన వినాయక చవితి ఒక సంస్కృతిక రాజకీయ పునర్జీవ వేదికగా నిలిచింది కానీ నేడు ఒకే వీధిలో ఒకే గ్రామంలో రెండు మూడు వినాయక మండపాలు కులాల వారీగా వర్గాల వారీగా రాజకీయ పార్టీల వారీగా విడిపోయి జరుపుకుంటున్నాయి కానీ ప్రస్తుతం అనేక పెద్ద గణపతి మండపాలకు ఘనపలకు కార్పొరేట్ లేదా రాజకీయ పార్టీల సహకారం లభిస్తోంది ఇది ఒక విధంగా ఓటు బ్యాంకు రాజకీయాలకు దారితీస్తోంది.



వినాయక చవితి ఒక మతపరమైన పండుగ మాత్రమే కాకుండా చరిత్రలో స్వాతంత్ర్య పోరాటానికి ఆయుధం నేడు రాజకీయ ప్రభావానికి వేదిక. రాజకీయాల సమ్మేళనంగా ప్రత్యేక స్థానం సంపాదించింది కానీ ప్రస్తుతం వినాయక విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయనిక రంగులు వాడడం వలన చెరువులు నదులు ఇతర జలవనులు తీవ్రంగా కలుషితమవుతున్నాయి నిమజ్జనం తర్వాత నీటిలో కలిసే రసాయనాలు జలచరాలకు హాని కలిగించడమే కాకుండా నీటి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి పూజా సామగ్రి ప్లాస్టిక్ కవర్లు అలంకరణ వ్యర్థాలు కూడా నీటి వనరులకు చెత్త కుప్పలుగా మారుస్తున్నాయి. దేవుడిని పూజించే పేరుతో ప్రకృతి నాశనం చేయడం ఎంతవరకు సమంజసం అయితే సమస్య కేవలం ప్రజలదే కాదు వ్యవస్థలోని పర్యావేక్ష ణా లోపం కూడా ప్రధాన కారణం. పర్యావరణ నిబంధనలు శబ్ద కాలుష్యం పరిమితులు విగ్రహాల తయారీకి సంబంధించిన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాటి అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంలో అధికార యంత్రాంగం తరచూ విఫలమవుతుంది. నిబంధనలు కాగితాలపై కఠినంగా ఉన్న వాటిని ఉల్లంఘించినప్పుడు చర్యలు తీసుకోవడంలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తోంది. పర్యావరణహిత వినాయక చవితి అంటే పండుగను ఆపివేయడం కాదు పండుగను బాధ్యతతో జరుపుకోవడం మట్టి వినాయకుడిని ప్రతిష్టించి సహజ పర్యావరణం పదార్థాలతో అలంకరించి ఇంట్లోనే లేదా నిర్దేశిత ప్రదేశాలలో నిమజ్జనం చేయవచ్చు. పూజా సామాగ్రి నీటిలో పడవేయకుండా ప్రత్యేకంగా సేకరించి సరియైన విధంగా నిర్వహించవచ్చు గణేష మండపాలు పోటీకి కాకుండా సేవా కార్యక్రమాలకు వేదికలుగా మారాలి వినాయకుడు విజ్ఞానాలను తొలగించే దేవుడు మరి మన పండగ వల్లే పర్యావరణానికి కొత్త విఘ్నాలు ఎందుకు సృష్టించాలి ప్రకృతిని కాపాడడమే వినాయకుడికి మనం ఇవ్వగలిగే నిజమైన నైవేద్యం పర్యావరణ పరిరక్షణ బాధ్యత ఒక ప్రభుత్వానిదే కాదు అధికారులకు కూడా కాదు నిర్వాహకులదే కాదు ప్రభుత్వ నిబంధనలను కఠినంగా అమలు చేయాలి రాజకీయ నాయకులు బాధ్యతాయుతమైన ఆదర్శాన్ని చూపాలి నిర్వహకులు ఆర్భాటానికి దూరంగా ఉండాలిఉండాలి. ప్రజలు యువత తమ గొప్పతనాన్ని పర్యావరణహిత మార్గంలో జరిపి చూపించాలి ప్రకృతి మరియు సమాజాన్ని గౌరవిస్తూనే గణేశుడి పండుగను భక్తితో జరుపుకోవడం నిజంగా అర్థవంతం చేస్తుంది.

జనం వార్త




# నైపుణ్యాల్లేని పట్టాలు..
# యువతకు భారమే.!

- ఉద్యోగాల కొరత కంటే ఉపాధికి అవసరమైన నైపుణ్యాల కొరతే నేడు అతిపెద్ద సవాలు
- విద్యార్థులు, విద్యాసంస్థలు, ప్రభుత్వం కలిసి బాధ్యతగా వ్యవహరిస్తేనే మనుగడ
- చదువు.. పట్టా నుంచి ఉపాధి వరకు నిజమైన వారధిగా మారుతుంది

**"చదువుకుంటే జీవితం మారుతుంది" అని పెద్దలు చెప్పిన మాట ఇప్పటికీ సత్యమే. కానీ నేటి పరిస్థితుల్లో దానికి మరో ప్రశ్న జత కలుస్తోంది. చదువు పూర్తవుతోంది.. పట్టా చేతికొస్తోంది.. కానీ ఉద్యోగం ఎందుకు దక్కడం లేదు.? నాలుగేళ్లు, ఐదేళ్లు ఉన్నత విద్య చదివిన యువకుడు ఉద్యోగానికి సిద్ధంగా ఎందుకు ఉ ండడం లేదు.? జీవితాన్ని స్వయంగా నిర్మించుకునే ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ఎందుకు పెరగడం లేదు.?**

**హైదరాబాద్ :** ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్యాలపై చేసిన వ్యాఖ్య రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఆయన ఉపయోగించిన పదాలపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ ఆయన ప్రస్తావించిన సమస్య మాత్రం కొత్తది కాదు. చాలాకాలంగా పరిశ్రమలు, ఉద్యోగ నియామక సంస్థలు, విద్యావేత్తలు ఒకే విషయాన్ని చెబుతున్నాయి.. డిగ్రీలు పెరుగుతున్నాయి.. కానీ నైపుణ్యాలు పెరగడం లేదు.

## గణాంకాలు చెప్పేది ఇదే

ప్రతి సంవత్సరం దేశంలో లక్షలాది మంది ఉన్నత విద్య పూర్తి చేస్తున్నారు. అయినప్పటికీ వారిలో గణనీయమైన సంఖ్యలో యువతకు తగిన ఉపాధి లభించడం లేదు. కారణం ఉద్యోగాల కొరత ఒక్కటే కాదు. ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాల కొరత కూడా అంతే పెద్ద కారణం.ఇండియా స్కిల్స్ రిపోర్ట్--2026 ప్రకారం ఉన్నత విద్య పూర్తిచేసిన యువతలో కేవలం 36.6 శాతం మందికే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఉన్నాయి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే గణాంకాలు కూడా ఉన్నత విద్యావంతుల్లో నిరుద్యోగం ఎక్కువగానే ఉందని సూచిస్తున్నాయి. పదో తరగతి వరకు చదివిన వారితో పోలిస్తే ఉన్నత విద్య పూర్తిచేసిన వారిలో నిరుద్యోగిత రేటు అధికంగా ఉండటం ఆందోళన కలిగించే విషయం. అంటే సమస్య ఉద్యోగాల కొరత మాత్రమే కాదు... ఉద్యోగానికి తగిన సామర్థ్యం లేకపోవడమూ అంతే పెద్ద సమస్య.

## మార్కులు వస్తున్నాయి... నైపుణ్యాలు మెరుగుపడడం లేదు

మన విద్యా వ్యవస్థలో చిన్నప్పటి నుంచే ఒకే లక్ష్యం కనిపిస్తుంది--- మంచి మార్కులు, మంచి ర్యాంకులు. విద్యార్థి పుస్తకాలు చదువుతాడు. పరీక్షలు రాస్తాడు. డిగ్రీ సాధిస్తాడు. కానీ ఉద్యోగ ప్రపంచంలో అవసరమైన అనేక జీవన నైపుణ్యాలు మాత్రం అభివృద్ధి చెందడం లేదు.

- సమస్యను విశ్లేషించడం
- పరిష్కారాన్ని ఆలోచించడం
- ధైర్యంగా మాట్లాడడం
- తన అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తీకరించడం
- బృందంతో కలిసి పనిచేయడం
- సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం
- సమయపాలన, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం

ఈ నైపుణ్యాలే నేటి ఉద్యోగ విపణిలో విజయాన్ని నిర్ణయిస్తున్నాయి. కానీ ఇవే చాలా మంది విద్యార్థుల్లో లోపిస్తున్నాయి. అందుకే ఇంటర్వ్యూల్లో సాధారణ ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పలేక వెనుదిరుగుతున్నారు.

## విద్యాసంస్థల పాత్ర కీలకం

- ఈ పరిస్థితికి విద్యార్థులను మాత్రమే బాధ్యులుగా చేయడం సరైంది కాదు. వారిని తీర్చిదిద్దే బాధ్యత విద్యాసంస్థలదీ.
- అనేక కళాశాలలు నాణ్యమైన విద్య అందిస్తున్నప్పటికీ, కొన్ని చోట్ల ఇంకా పాత పద్ధతులే కొనసాగుతున్నాయి.

## కాలానుగుణంగా మారని పాఠ్యాంశాలు

- ప్రయోగశాలలు ఉన్నా ఆచరణాత్మక శిక్షణ లేకపోవడం
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బోధన జరగకపోవడం
- ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టు ఆధారిత అభ్యాసానికి తగిన ప్రాధాన్యం లేకపోవడం
- సంభాషణ, వ్యక్తిత్వ వికాసంపై సరైన దృష్టి లేకపోవడం
- ఫలితంగా కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థి చేతిలో డిగ్రీ ఉంటుంది. కానీ ఉద్యోగ విపణిలో పోటీ పడే నైపుణ్యం ఉండదు.

## వ్యవస్థలోనే మార్పు అవసరం

కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికత, స్వయంచాలక వ్యవస్థలు ప్రపంచ ఉద్యోగ రంగాన్ని వేగంగా మార్చేస్తున్నాయి. కానీ మన విద్యా విధానం అదే వేగంతో మారుతోందా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, విధాన నిర్ణేతలపై ఉంది. పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక శిక్షణ, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలతో అనుసంధానం విద్యలో విడదీయరాని భాగం కావాలి. విద్యార్థి చదువుతున్నప్పుడే ఉద్యోగ ప్రపంచాన్ని పరిచయం చేసే విధంగా విద్యా వ్యవస్థ రూపుదిద్దుకోవాలి.

## విద్యార్థులూ మారాలి

వ్యవస్థలో లోపాలు ఉన్నాయనేది నిజమే. కానీ మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా తమను తాము మార్చుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదీ. నేడు ప్రపంచ స్థాయి విద్యా వనరులు, శిక్షణా కార్యక్రమాలు, కొత్త నైపుణ్యాలు అన్నీ ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అవకాశాల కొరత లేదు. వాటిని వినియోగించుకునే ఆసక్తి, క్రమశిక్షణ అవసరం. డిగ్రీతో చదువు ముగియదు. జీవితాంతం నేర్చుకుంటూ ఉండడమే నిజమైన విద్య.

తల్లిదండ్రుల ఆలోచనలోనూ మార్పు రావాలి

చాలా కుటుంబాల్లో ఇప్పటికీ వినిపించే ప్రశ్న... "ఎన్ని మార్కులు వచ్చాయి?" కానీ నేటి కాలంలో అడగాల్సిన ప్రశ్న... "ఈ రోజు కొత్తగా ఏమి నేర్చుకున్నావు?" పిల్లలకు పరీక్షల్లో విజయం మాత్రమే కాదు... జీవితంలో నిలబడే ధైర్యం, బాధ్యత, క్రమశిక్షణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార దృక్పథం కూడా నేర్పాలి.

## నైపుణ్యాలే దేశ భవిష్యత్తు

భారత్ ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో ఒకటి. ఈ యువశక్తి సరైన నైపుణ్యాలతో ముందుకు సాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ మరింత శక్తివంతమైన దేశంగా ఎదుగుతుంది. అదే నైపుణ్యాలు లేకపోతే నిరుద్యోగం, నిరాశ, అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

## అందుకే దేశానికి అవసరమైనవి...

- కొత్త భవనాలు మాత్రమే కాదు... నాణ్యమైన విద్య.
- కొత్త డిగ్రీలు మాత్రమే కాదు... ఉపాధిని కల్పించే నైపుణ్యాలు.
- కొత్త హామీలు మాత్రమే కాదు... భవిష్యత్తును నిర్మించే విద్యా సంస్కరణలు.
- విద్యార్థులను విమర్శించడం సులభం. వారిని సమర్థులుగా తీర్చిదిద్దడం మాత్రం సమాజం మొత్తం బాధ్యత.
- ప్రభుత్వం మారాలి.
- విద్యా విధానం మారాలి.
- విద్యాసంస్థలు మారాలి.
- ఉపాధ్యాయులు మారాలి.
- తల్లిదండ్రులు మారాలి.
- విద్యార్థులు కూడా మారాలి.

ఈ ఆరుగురు కలిసి మారితేనే దేశ భవిష్యత్తు మారుతుంది. పట్టా జీవితానికి ఆరంభం మాత్రమే... గమ్యం కాదు. డిగ్రీ ఒక కాగితం మాత్ర మే... ఆ కాగితానికి విలువ తెచ్చేది నైపుణ్యం. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టేది డిగ్రీలు కాదు.. నైపుణ్యాలతో, ఆత్మవి శ్వాసం తో, నవ్య ఆలోచనలతో ముందుకు సాగే యువశక్తే. అదే నిజమైన అభివృద్ధి.. అదే దేశ భవిష్యత్తు..

– అజయ్ కుమార్



# ఆసియాకప్ టీ20 టోర్నీ.. భారత అమ్మాయిలదే

**ఫైనల్లో లంకపై ఘనవిజయం**
**విజృంభించిన శ్రీచరణి, దీప్తి**
**మెరిసిన షెఫాలి, స్మృతి**

**దిల్లీ :** ఆసియాకప్ టీ20 టోర్నీలో భారత మహిళల జట్టే విజేతగా నిలిచింది. టోర్నీలో ఒక్క ఓటమి లేకుండా హర్మన్‌ప్రీత్ బృందం టైటిల్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 72 పరుగుల తేడాతో లంకను చిత్తు చేసింది. షెఫాలి వర్మ (68; 39 బంతుల్లో 9x4, 2x6), స్మృతి మంధాన (59; 39 బంతుల్లో 5x4, 3x6) మెరుపులతో మొదట భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసింది. ఛేదనలో తెలుగమ్మాయి శ్రీచరణి (4/20), దీప్తి శర్మ (3/19) విజృంభించడంతో లంక 20 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. చమరి ఆటపట్టు (36), నీలాక్షిక (22), విష్మి (20) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు.

శ్రీచరణి, దీప్తి మాయాజాలం: ఛేదనలో లంకకు ఆరంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఓపెనర్ ఇమేషా (4)ని క్రాంతి గౌడ్ బౌల్డ్ చేసి భారత్‌కు శుభారంభం అందించింది. తొలి ఓవర్లోనే వికెట్ పడడంతో లంక బ్యాటర్లు నెమ్మదిగా ఆడారు. 4 ఓవర్లకు ఆ జట్టు స్కోరు 21 పరుగులే! ఈ స్థితిలో కెప్టెన్ చమరి ఆటపట్టు.. షెఫాలి బౌలింగ్‌లో 6, 4తో స్కోరు కదిలించింది. ఆ తర్వాత ప్రేమ బౌలింగ్‌లోనూ చమరి సిక్స్, ఫోర్ బాదడంతో 9 ఓవర్లకు 61/1తో లంక కాస్త కోలుకుంది. కానీ సాధించాల్సిన రన్‌రేట్ మాత్రం తగ్గలేదు. దీప్తి వేసిన పదో ఓవర్లో భారీ షాట్‌కు వెళ్లిన







చమరి.. స్టంపౌట్‌గా వెనుదిరిగింది. అదే ఓవర్లో విష్మి గుణరత్నే (20) కూడా ఔటైపోవడంతో లంకపై ఒత్తిడి మరింత పెరిగింది. 14వ ఓవర్లో హర్షిత (9)ను శ్రీచరణి తన బౌలింగ్‌లోనే క్యాచ్ పట్టి డగౌట్‌కు పంపడంతో లంకకు ఇంకో దెబ్బ తగిలింది. సమీకరణం (36 బంతుల్లో 94 పరుగులు) మరింత కఠినంగా మారింది. 16 ఓవర్లో కవీష (7), నీలాక్షిక (22)లను శ్రీచరణి.. తర్వాతి ఓవర్లో హాసిని (1)ని షెఫాలి ఔట్ చేయడంతో లంక కనీస పోరాటం చేయలేకపోయింది. చివరి 5 వికెట్లను ఆ జట్టు 11 పరుగులకే కోల్పోయింది.

షెఫాలి, స్మృతి మెరుపులు: మొదట భారత్ భారీ స్కోరు చేసిందంటే ఓపెనర్లు షెఫాలి, స్మృతి దూకుడే కారణం. టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌ను స్మృతి బౌండరీతో మొదలుపెట్టగా.. తర్వాత షెఫాలి చెలరేగింది. మిథాలి వేసిన మూడో ఓవర్లో రెండు ఫోర్లు, తర్వాత చమరి ఆటపట్టు (5వ ఓవర్) బౌలింగ్‌లో 4, 6, 6తో షెఫాలి స్కోరు పెంచింది. స్మృతి కూడా షాట్లకు దిగడంతో 12 ఓవర్లకు 121/0తో భారత్ భారీ స్కోరు దిశగా సాగింది. అప్పటికే షెఫాలి 24 బంతుల్లో, స్మృతి 35 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. భారత్ జోరు చూస్తే తేలిగ్గా 200 పరుగులు సాధిస్తుందేమో అనిపించింది. కానీ తర్వాత భారత్ ఇన్నింగ్స్ అనూహ్యంగా కుదుపునకు లోనైంది. కుదురుకున్న షెఫాలి, స్మృతితో పాటు రిచా (17), హర్మన్‌ప్రీత్ 14), దీప్తి (5) స్వల్ప వ్యవధిలో ఔటైపోయారు. 38 పరుగుల తేడాతో 5 వికెట్లు పడిపోయాయి. దీంతో భారత్ 18.5 ఓవర్లకు 167/5తో నిలిచింది. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ చివరి రెండు బంతులకు కమలిని (15 నాటౌట్; 5 బంతుల్లో 1x4, 1x6).. 4, 6 కొట్టడంతో స్కోరు 180 దాటింది. ఆసియాకప్ పదిసార్లు జరిగితే ఎనిమిదిసార్లు (2004, 2005, 2006, 2008, 2012, 2016, 2022, 2026) భారతే విజేతగా నిలిచింది. బంగ్లాదేశ్ (2018), శ్రీలంక (2024) ఒక్కోసారి నెగ్గాయి. భారత్ టీ20, వన్డే ఫార్మాట్లలో 4సార్ల చొప్పున కప్‌ను గెలిచింది.

---

## టెస్టు క్రికెట్‌కు పాక్ అపకారం చేస్తోంది

**దినేశ్ కార్తీక్ కీలక వ్యాఖ్యలు**



పాకిస్థాన్ క్రికెట్‌లో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలపై భారత మాజీ ఆటగాడు దినేశ్ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. టెస్టుల్లో గొప్ప చరిత్ర కలిగిన పాక్.. ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా టెస్టు దేశాలతో పోటీపడే స్థితిలో లేదని వ్యాఖ్యానించాడు. తాజాగా ఇంగ్లాండ్‌పై మూడు టెస్టుల సిరీస్‌లో పాకిస్థాన్ వైట్‌వాష్‌కు గురైన నేపథ్యంలో దినేశ్ కార్తిక్ ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశాడు. "నేను ఇంగ్లాండ్ జం పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌కు వ్యాఖ్యానం చేసినప్పుడు ఈ పాక్ జట్టు చాలా సాధారణంగా అనిపించింది. మొదటి రెండు టెస్టుల్లో వారు రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 90 ఓవర్లు కూడా ఆడలేదు. పిచ్‌లు చాలా కఠినంగా ఉన్నాయి. కానీ, రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 90 ఓవర్లు కూడా ఆడలేనంత క్లిష్టమైన పిచ్‌లు కావవి. పాకిస్థాన్ జట్టు టెస్ట్ క్రికెట్‌కు అపకారం చేస్తోందని నాజర్ హుస్సేన్ (ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్) అన్నాడు. నేను అతనితో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. చివరి టెస్టులో రజావుల్లా బాగా రాణించాడు. అతను ఆరంభం నుంచే జట్టులో ఎందుకు లేడు? అసలు ఎంపిక ప్రక్రియలో ఏం జరుగుతోంది? ఎలాంటి ఆటగాళ్లను తీసుకుంటున్నారు? కెప్టెన్సీ మార్పులు, కోచ్‌ల మార్పులు అన్నీ అస్థిరంగా కనిపిస్తున్నాయి. ఆ ప్రభావం వారి ఆటతీరులో స్పష్టంగా కనిపిస్తోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వారు ఆశించిన స్థాయిలో ఆడలేదు. కనీసం గట్టి పోటీనిచ్చేలా కూడా అనిపించలేదు. నిజాయితీగా చెప్పాలంటే, ప్రస్తుత పరిస్థితుల్లో వారు చాలా టెస్ట్ ఆడే దేశాలతో పోటీ పడగలరని నాకు అనిపించడం లేదు. ఇది నిజంగా బాధాకరం. టెస్ట్ క్రికెట్‌లో పాక్‌కు గొప్ప చరిత్ర ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో వారు ఆ స్థాయికి ఏమాత్రం దగ్గరగా లేరు. పాక్ క్రికెట్‌లో పరిస్థితి ఆందోళనకరంగా కనిపిస్తోంది. సరైన వ్యక్తులు దీనిని గమనించి తిరిగి గాడిలో పెట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో అది అంత సులభమైన పనిలా అనిపించడం లేదు" అని దినేశ్ కార్తీక్ వివరించాడు.

---

## తొలి టీ20లో అఫ్గానిస్థాన్‌పై భారత్ ఘనవిజయం

**అదరగొట్టిన అభిషేక్**

దిల్లీ : అభిషేక్ శర్మ (82; 32 బంతుల్లో 7x4, 7x6) రెచ్చిపోవడంతో ఆదివారం అఫ్గానిస్థాన్‌తో తొలి టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట అఫ్గానిస్థాన్ 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. అజ్మతుల్లా (64 నాటౌట్; 44 బంతుల్లో 4x4, 4x6) టాప్ స్కోరర్. అర్ష్‌దీప్ (3/19), వరుణ్ చక్రవర్తి (1/16), అక్షర్ పటేల్ (1/27) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. అభిషేక్‌తో పాటు ఇషాన్ కిషన్ (42; 33 బంతుల్లో 5x4, 1x6) మెరవడంతో లక్ష్యాన్ని భారత్.. 13.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది. రెండో టీ20 మంగళవారం జరుగుతుంది.

దంచేశారు..: ఛేదనలో ఓపెనర్ సంజు శాంసన్ (10) త్వరగానే నిష్క్రమించినా.. అది భారత్ ఇన్నింగ్స్‌పై ఎలాంటి ప్రభావం చూపించలేదు. కారణం మరో ఓపెనర్ అభిషేక్ శర్మ. అతడు.. అఫ్గాన్ బౌలింగ్‌ను ఉతికారేశాడు. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు బాదేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మూడో ఓవర్లో అజ్మతుల్లా బౌలింగ్‌లో





సిక్స్, ఫోర్ దంచేసిన అతడు.. అదే ఊపు కొనసాగించాడు. ఇషాన్ అతడికి సహకరించాడు. అభిషేక్ ఫోర్, సిక్స్.. ఇషాన్ ఫోర్, సిక్స్ బాదడంతో ఓ ఓవర్లో ఫారూఖి 26 పరుగులు సమర్పించుకున్నాడు. అభిషేక్ 22 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత రషీద్ ఓవర్లో వరుసగా 6, 4 బాదిన అతడు.. నూర్‌ను వరుసగా 6, 6తో శిక్షించాడు. 10 ఓవర్లలో 130/1తో టీమ్‌ఇండియా విజయం ఖాయమైపోయింది. అభిషేక్, ఇషాన్ ఔటైనా.. కెప్టెన్ శ్రేయస్ (8 నాటౌట్), తిలక్ వర్మ (3 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు. అభిషేక్, ఇషాన్ జంట రెండో వికెట్‌కు 53 బంతుల్లోనే 121 పరుగులు జోడించింది.

అఫ్గాన్ కట్టడి: అంతకుముందు భారత్ బంతితో అఫ్గానిస్థాన్‌కు కళ్లెం వేసింది. నిజానికి అఫ్గాన్ 158 చేయడం కూడా ఎక్కువే. అర్ష్‌దీప్ అక్షర్, వరుణ్ చాలా పొదుపుగా బౌలింగ్ చేశారు. బుమ్రా (1/26).. 16 డాట్ బాల్స్ వేశాడు. అఫ్గాన్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. గుర్బాజ్‌ను ఔట్ చేయడం ద్వారా రెండో బంతికే ఆ జట్టును బుమ్రా దెబ్బతీశాడు. నాలుగో ఓవర్లో 38/1తో ఉన్న అఫ్గాన్.. భారత బౌలర్ల ధాటికి 5 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది. ఇషాన్ కిషన్ సూపర్ ఫీల్డింగ్‌కు ఇబ్రహీం జద్రాన్ (11) రనౌట్ కాగా.. సెదికుల్లా (13)ను అర్ష్‌దీప్, నైబ్ (2)ను అక్షర్, రసూలి (2)ని వరుణ్ చేశారు. అయితే 43/5తో నిలిచిన అఫ్గానిస్థాన్‌ను అజ్మతుల్లా, నబి (33) ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 83 పరుగులు జోడించారు. 17వ ఓవర్లో నబిని అర్ష్‌దీప్ ఔట్ చేయడంతో ఈ భాగస్వామ్యం విడిపోయింది. నితీష్ (2 ఓవర్లలో 30), దూబె (1 ఓవర్లో 21) భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఆఖరి మూడు ఓవర్లలో అఫ్గాన్ 2 వికెట్లు కోల్పోయి 29 పరుగులు చేసింది.

# సైమా అవార్డ్స్-2026

## ఉత్తమ నటుడు నాగచైతన్య.. ఉత్తమ చిత్రం 'మిరాయ్'



సైమా అవార్డ్స్-2026 వేడుక అట్టహాసంగా జరిగింది. బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన ఈ అవార్డుల సంబరానికి దక్షిణాది సినీ తారలు విచ్చేసి సందడిచేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో భాగంగా తొలిరోజు తెలుగు, కన్నడ సినిమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులు అవార్డులు అందుకున్నారు. 'తండేల్'లో నటనకు గానూ నాగచైతన్య ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే 'మిరాయ్'లో నటనకు గానూ యువ కథానాయకుడు తేజ సజ్జా ఉత్తమ నటుడి (క్రిటిక్స్) అవార్డును అందుకున్నారు. ఈ మూవీ వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఈ అవార్డును కూడా అందుకోవడం మరో విశేషం. ఇక ఉత్తమ నటి (క్రిటిక్స్) అవార్డును 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో నటనకుగానూ ఐశ్వర్య రాజేశ్‌ను వరించింది. ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం) ఉత్తమ హాస్యనటుడి అవార్డును బుల్లిరాజు అలియాస్ భీమల రేవంత్ (సంక్రాంతికి వస్తున్నాం) అందుకున్నారు. ఇక 'కాంతార: చాప్టర్1'లో అద్భుతంగా నటించి ప్రేక్షకులను అలరించిన కన్నడ నటుడు రిషబ్‌శెట్టి ఉత్తమ నటుడి అవార్డు సొంతమైంది.








### అవార్డులు అందుకున్న సినీతారలు వీళ్లే

ఉత్తమ నటుడు – నాగచైతన్య (తండేల్)
ఉత్తమ నటుడు (క్రిటిక్స్) – తేజ సజ్జా (మిరాయ్)
ఉత్తమ నటి (క్రిటిక్స్) – ఐశ్వర్య రాజేశ్ (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ దర్శకుడు – అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్) – చందూ మొండేటి (తండేల్)
ఉత్తమ చిత్రం – మిరాయ్
ఉత్తమ ప్రతినాయకుడు – మంచు మనోజ్ (మిరాయ్)
ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్ – (సంక్రాంతికి వస్తున్నాం)
బెస్ట్ ఎంటర్‌టైనర్ – వెంకటేశ్ (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ సహాయ నటుడు – సత్యదేవ్ (కింగ్డమ్)
ఉత్తమ సహాయ నటి – శ్రద్ధా శ్రీనాథ్ (డాకు మహారాజ్)
ఉత్తమ హాస్య నటుడు – బుల్లిరాజు (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ సినిమాటోగ్రఫీ –కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ నేపథ్య గాయకుడు –రమణ గోగుల (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ నేపథ్య గాయని –సమీరా భరద్వాజ్ (కోర్ట్)
ఉత్తమ నటుడు (పరిచయ) – హర్ష్ రోషన్ (కోర్ట్)
ఉత్తమ నటి (పరిచయ) – శ్రీదేవి (కోర్ట్)
ఉత్తమ నటి (పరిచయ) –సాక్షి మడోల్కర్ (మోగ్లీ)
ఉత్తమ గేయ రచయిత: పూర్ణా చారి (కోర్ట్)



## చెప్పులతో పోస్టర్లపై కొట్టడంతో చాలా బాధపడ్డాను: వైష్ణవి చైతన్య

'బేబీ' చిత్రంతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించి ఓవర్ నైట్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్య ఇటీవల 'ఎపిక్' మూవీతో మరోసారి థియేటర్ల ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను, ముఖ్యంగా 'బేబీ' సినిమా సమయంలో వచ్చిన విపరీతమైన నెగెటివిటీని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. తనకు 'బేబీ' సినిమాతో ఒక్క రాత్రిలో ఎలాంటి సక్సెస్ రాలేదని వైష్ణవి స్పష్టం చేశారు. కవర్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్, పలు చిత్రాల్లో చిన్న చిన్న క్యారెక్టర్ రోల్స్ చేస్తూ ఎంతో కష్టపడి ఇక్కడికి చేరుకున్నానని ఆమె తెలిపారు. అయితే సినిమా విడుదలైన తర్వాత కొందరు తనను ఉద్దేశించి నోటికి వచ్చినట్లు గలీజ్‌గా మాట్లాడారని, థియేటర్ల వద్ద తన పోస్టర్లపై చెప్పులతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఆ దృశ్యాలన్నీ చూశాక ఎంతో బాధపడ్డానని తెలిపారు. సినిమా సూపర్ హిట్ అయిందని సంతోషించాలా? లేక తాను పడిన కష్టానికి ఈ రకమైన అవమానాలే బహుమతిగా వస్తున్నాయని బాధపడాలా? అనే తీవ్రమైన మానసిక వేదనలోకి వెళ్లిపోయానని వైష్ణవి అన్నారు. అయితే కాలం మారుతున్న కొద్దీ ఆ నెగెటివిటీ గురించి పట్టించుకోవడం మానేశానని, కేవలం తన పనిపై, సానుకూల అంశాలపై మాత్రమే దృష్టి పెట్టడం మొదలుపెట్టానని ఆమె వివరించారు.



## ఫెమినిజం అర్థాన్ని చాలామంది తప్పుగా అర్థం చేసుకున్నారు : పాయల్ రాధాకృష్ణ

టాలీవుడ్ యంగ్ బ్యూటీ పాయల్ రాధాకృష్ణ 'హ్యాపీ జర్నీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అభిరామ్ నాయుడు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏడుగురు మహిళలు కలిసి చేసే యూరప్ ట్రిప్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా పూర్తిగా భావోద్వేగభరితంగా సాగుతుంది. అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ తాజాగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో పాయల్ రాధాకృష్ణ మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలోచక్కర్లు కొడుతున్నాయి. సినిమాలో పోస్టర్లు చూసి కేవలం అమ్మాయిల ప్రయాణం మాత్రమే అనుకోవద్దని, కానీ కథ క్లైమాక్స్‌లోకి వెళ్లేసరికి వారి జీవితాల్లోకి అబ్బాయిల ప్రాధాన్యత ఏంటో తెలుస్తుందని ఆమె చెప్పారు. ఫెమినిజం అంటే అబ్బాయిలను వ్యతిరేకించడం కాదని, నేటి సమాజంలో కొందరు దీని అర్థాన్ని పూర్తిగా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని పాయల్ అభిప్రాయపడ్డారు. ఈ సృష్టిలో అమ్మాయి ఉండాలంటే అబ్బాయి ఉండాలని, అలాగే అబ్బాయి ఉండాలంటే అమ్మాయి అవసరం ఉంటుందని, అదే అసలైన జీవిత సౌందర్యమని ఆమె పేర్కొన్నారు. అలాగే జీవితంలో ఆ అబ్బాయి బాయ్‌ఫ్రెండ్‌గా, భాగస్వామిగా మాత్రమే కాకుండా బ్రదర్‌గా, కొడుకుగా, ఫాదర్‌గా ఏ రూపంలోనైనా మనకు తోడుగా ఉంటాడని వివరించారు. ఇక సినిమా షూటింగ్ సమయంలో సెట్స్‌లో మగ డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు తమను ఎంతో బాధ్యతగా చూసుకున్నారని, వారి సపోర్ట్ వల్లే తామంతా ఎక్కడా ఇబ్బంది పడకుండా చాలా సేఫ్‌గా ఫీలయ్యామని అన్నారు. మీ ఇంట్లో తండ్రి లేదా సోదరుడు ఉండి వారిపై ప్రేమను సరిగ్గా వ్యక్తపరచలేకపోతే, అలాంటి వారు తమ 'హ్యాపీ జర్నీ' సినిమాను ఫ్యామిలీతో కలిసి చూడాలని పాయల్ కోరారు. ఈ ప్రయాణం కచ్చితంగా ప్రతి ఒక్కరి మనసును హత్తుకుంటుందని ఆమె చెప్పారు.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083..EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com